తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
7 జూన్ 2026
పేజీలు : 08




# వేరుశనగ విత్తనాలు తిన్న పందికొక్కులు

## రైతులను ఆగం చేసిన అధికారులు

- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- పొంతనలేని సమాధానంతో దాటవేస్తున్న వ్యవసాయ అధికారులు
- తవ్వినకొద్ది బయటకు వస్తున్న అవినీతి

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6 (జనం సాక్షి):**

రైతన్న అంటే అందరికీ లోకువే.. నోరు తెరిచి అడగలేని బక్క రైతన్నను దోచుకోవడానికి దళారుల నుంచి ప్రభుత్వ అధికారుల వరకు అందరూ ముందు వరసలో నిలుచుంటారు. ఇదే క్రమంలో రైతులను దగా చేసిన అధికారుల అవినీతి బాగోతం బయటపడింది. వివరాలు లోకి వెళితే రైతులకు చేయూతనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రబ్బి సీజన్ లో ఉచితంగా వేరుశనగ విత్తనాలను అందజేసింది. రైతులు నూనె గింజలను పండించడానికి అవగాహన కల్పించి వారిని ప్రోత్సహిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ మండలాలలో రైతులకు ఉచితంగా 50 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను సరఫరా చేసింది. కానీ క్షేత్రస్థాయిలో రబ్బికి ఉపయోగించే వేరుశనగ విత్తనాలు రైతులకు అందలేదు. వ్యవసాయ శాఖ అధికారులు మధ్యవర్తులతో మిలాఖత్ అయి ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలను స్వాహా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి కొడంగల్ తాండూర్ వికారాబాద్ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలలో వ్యవసాయ అధికారులు వేరుశనగ విత్తనాలను రైతులకు అందివ్వకుండా అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రాథమికంగా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలోని కొన్ని గ్రామాలను తీసుకుంటే దాదాపు కోటి 40 లక్షల ఉచిత సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కాజేసినట్లు మొదటగా వెలుగులోకి వచ్చింది.

మెయిన్‌లో

## ఖాన్ హోటల్ స్లాబ్ కూలి నలుగురికి గాయాలు

బాధితులను పరామర్శించిన స్పీకర్ ప్రసాద్ కుమార్



మెయిన్‌లో

## కుటుంబ బంధాల పరిరక్షణకు కౌన్సెలింగ్ కీలకం

డీజీపీ సీవీ ఆనంద్

- మహిళలు, బాలల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- 150కి పైగా దంపతులు పునరేకీకృతం
- “మీ సురక్ష - కలసి ఉంటే కలదు సుఖం” కార్యక్రమం
- కుటుంబ సామరస్యం, శాంతి కోసం కౌన్సెలింగ్ కేంద్రాలు

లోపలి పేజీలో




లోపలి పేజీలో

## బాలల భద్రత కోసం ‘సురక్ష మిత్ర’

### పరిగి పోలీస్ స్టేషన్‌లో ప్రారంభం

- ప్రజలను భాగస్వాములను చేసే వినూత్న కార్యక్రమం
- మహిళలు, బాలల రక్షణకు కమ్యూనిటీ పోలీసింగ్
- జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పిలుపు
- వాలంటీర్లకు శిక్షణ, ఉత్తములకు అవార్డులు

## వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చి భారీ దోపిడీ

- నేపాలీ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- తొమ్మిది మంది నిందితులు అదుపులో
- బంగారం, వెండి సొత్తు పూర్తిగా రికవరీ
- ఇంట్లో పనిమనిషిగా చేరి పథకం రచించిన ముఠా
- సీసీటీవీ, వేలిముద్రలతో గుర్తింపు



లోపలి పేజీలో

## విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- సైబరాబాద్ సిపి డా. ఎం. రమేష్
- స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలు
- సీసీటీవీ, జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి
- రియల్ టైమ్ అప్లికేషన్, కమాండ్ సెంటర్ ఏర్పాటు
- ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం



లోపలి పేజీలో

# విలేకరులకు లీకులు ఇస్తే దేవుడే శిక్షిస్తాడు

- సిబ్బందితో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వింత ప్రమాణం
- ఆశా వర్కర్ల ముందే సిబ్బందికి అవమానం
- కొందుర్గు పీహెచ్‌సీలో ఇంచార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అత్యుత్సాహం



కొందుర్గు (జనంసాక్షి) ప్రభుత్వ ఆసుపత్రుల్లో లోపాలను సరిదిద్దాల్సింది పోయి, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఒక బాధ్యతాయుతమైన అధికారిణి సిబ్బందితో బలవంతంగా ప్రమాణాలు చేయించిన వింత ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో శుక్రవారం వెలుగుచూసింది. "మీరు నమ్మే దేవుడి సాక్షిగా పీహెచ్‌సీ తప్పిదాలను, అంతర్గత విషయాలను ఎవరికీ చెప్పొద్దు అంటూ ఇంచార్జ్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ (ఇవజుర్‌ఎ ఇవీఓఉ) డాక్టర్ విజయలక్ష్మి ఎ,ఎన్,ఎమ్ సిబ్బందిని చేతులు చాచించి ప్రమాణం చేయించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కొందుర్గు పీహెచ్‌సి లో ఆశవర్కర్ల మీటింగ్ సందర్భంగా హాజరైన డాక్టర్ విజయలక్ష్మి కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న కొన్ని పొరపాట్లు, లోపాలు పత్రికల్లో, మీడియాలో వస్తుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆశవర్కర్ల సమావేశం ఏర్పాటు చేసి, ఆశా వర్కర్ల ముందే సిబ్బందిని తీవ్రంగా అవమానించేలా మాట్లాడారు. ఆసుపత్రిలోని ఏ ఒక్క సమాచారం కూడా బయటకు పొక్కకూడదని హుకుం జారీ చేశారు.అంతటితో ఆగకుండా, సమావేశంలో ఉన్న ఎ ఎన్ ఎమ్ సిబ్బందిని ఒక్కొక్కరిగా లేపి నిలబెట్టి, చేతులు ముందుకు చాచమన్నారు. "మనం చేసే తప్పులు, ఆసుపత్రి లోపాలు విలేకరులకు గానీ, బయట వ్యక్తులకు గానీ చెబితే మనం నమ్మే దేవుడే మనల్ని శిక్షిస్తాడు" అని బలవంతంగా దేవుడిపై ప్రమాణం చేయించారు. ఉన్నతాధికారి హోదాలో ఉన్న వ్యక్తి ఇలా తప్పిదాలను ప్రోత్సాహించి సిబ్బంది నోరు నొక్కేలా ప్రమాణం చేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనతో పీహెచ్‌సీ సిబ్బంది తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తోటి ఆశా వర్కర్ల ముందే తమను నిలబెట్టి, అనుమానిస్తూ ప్రమాణాలు చేయించడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. తప్పులను సరిదిద్దాల్సిన అధికారే.. వాటిని దాచడానికి ఇలాంటి చర్యలకు పాల్పడటం ఏంటని వైద్య వర్గాల్లో సైతం చర్చ నడుస్తోంది. ఈ నియంతృత్వ ధోరణిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని బాధ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## రైతులకు నష్టపరిహారం లేకుండా ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన దారుణం: మంచిరెడ్డి కిషన్ రెడ్డి

- కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపనపై మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- 115 మంది రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు ముందుగా నష్టపరిహారం చెల్లించాలి



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 6(జనం సాక్షి ): రంగారెడ్డి జిల్లా కోహెడలో ప్రతిపాదిత అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను పూర్తిగా పక్కనపెట్టి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 115 మంది రైతుల భూములను ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకోవడం అన్యాయమని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రైతుల భూములను తీసుకునే ముందు వారికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించి, వారి సమ్మతి తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల జీవనాధారమైన భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, వ్యవసాయ శాఖ పరిధిలో ఎలాంటి వివాదాలు లేని 507, 548 సర్వే నంబర్లలోని సుమారు 170 ఎకరాల భూమిలో మార్కెట్ నిర్మాణం చేపట్టకుండా, కొత్తగా 167/1 సర్వే నంబర్‌లో 179 ఎకరాల భూమిని కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ మార్పు వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో స్పష్టం చేయాలని కోరారు. 167/1 సర్వే నంబర్‌లో మొత్తం 239 ఎకరాల భూమి ఉందని, అందులో కొంతభాగం ఆంజనేయస్వామి దేవాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం ఇప్పటికే కేటాయించబడిందని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన 179 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ఆ ప్రాంతంలో మూడు పెద్ద గుట్టలు ఉన్నాయని, వాటిని పూర్తిగా తొలగించి నిర్మాణానికి అనుకూలంగా మార్చేందుకు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.రైతుల వద్ద ఎక్సెల్ పట్టాలు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి పరిహారం చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకోవడం చట్టబద్ధం కాదని ఆయన అన్నారు. అభివృద్ధి పేరుతో రైతుల హక్కులను కాలరాయడం సరైన విధానం కాదని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ముందుగా రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి సమ్మతి పొందిన తర్వాతే మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, రైతులకు న్యాయం జరిగే వరకు వారితో కలిసి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# లింగంపల్లిలో గ్రామసభ అభివృద్ధి పనులకు ఆమోదం




కోట్ పల్లి జూన్ 06(జనంసాక్షి): కోట్ పల్లి మండలం లింగంపల్లి గ్రామపంచాయతీలో "99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక"లో భాగంగా శనివారం గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన కీలక తీర్మానాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ చంద్రప్ప మాట్లాడుతూ..... వర్షాకాలం దృష్ట్యా దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులంతా పరిశుభ్రత పాటిస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ చంద్రప్ప, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్షియా, గ్రామ పెద్దలు వెంకటేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ,హర్షియా తదితరులు పాల్గొన్నారు.గ్రామసభలో పలువురు గ్రామస్తులు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని సానుకూలంగా స్వీకరించిన అధికారులు, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి అనేది ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యమని సభలో వక్తలు అభిప్రాయపడ్డారు.

## గడ్డమల్లయ్యగూడ గ్రామసభలో తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సు

రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరి: ఏసీపీ రాజు




యాచారం, జూన్ 6(జనం సాక్షి ) యాచారం మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో ముందుగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను ఎలా వేరు చేయాలనే అంశంపై గ్రామస్తులకు సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం గ్రామసభ అజెండాలో ఉన్న వివిధ అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి వివరించారు.ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ నందీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ఘోర ప్రమాదాలు, వాటి వల్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులపై గ్రామ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలత, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 30 రోజుల సమ్మర్ క్యాంపు ఘనంగా ముగింపు

విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుమతులు ప్రధానం



తాండూరు జూన్ 6(జనంసాక్షి) తాండూరులో 30 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ క్యాంపులో విద్యార్థులకు ధ్యానం, యోగ, భగవద్గీత శ్లోకాల పఠనం, ఆటలు, డ్రాయింగ్‌తో పాటు పలు వ్యక్తిత్వ వికాస అంశాలపై శిక్షణ అందించారు.క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ముగింపు సందర్భంగా ప్రదర్శించారు.స్థానిక కౌన్సిలర్ నాగారం మల్లేష్ ,శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, సృజనాత్మకత మరియు నైతిక విలువలు పెంపొందించడంలో ఈ సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడిందని అన్నారు.కార్యక్రమంలో విద్యార్థుల నృత్య సంస్కృత శ్లోకాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు మోహన్ రెడ్డి,కేవీఎం వెంకట్ ,ఫారెస్టు అధికారులు స్నేహ సాయి ,స్వప్న, అభ్యాస పాఠశాల ప్రిన్సిపల్ కవిత జనార్దన్ రెడ్డి ,సరిత, రఘు, రాజశేఖర్, మీనాక్షి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు ప్రోత్సహించినతల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## నోటి ఆరోగ్యం ద్వారానే చర్మ సంరక్షణ : డా.సోనియా దత్తా



ఖైరతాబాద్, జూన్ 06 (జనం సాక్షి) : నోటి ఆరో గ్యం, చర్మ సమస్యల మధ్య సన్నిహిత సంబంధం ఉందని ప్రముఖ ఆరోగ్య నిపుణురాలు డా.సోని యా దత్తా తెలిపారు.నోటి పరిశుభ్రత లోపించడం వల్ల బ్యాక్టీరియా పెరిగి శరీరంలో వాపు (ఇన్ఫ్లమే షన్) ఏర్పడుతుందని, ఇది మొటిమలు, కాంతిహీ నత వంటి చర్మ సమస్యలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. చర్మ సమస్యలను కేవలం పైపూత మందులతో నియంత్రించడంపై కాకుండా, నోటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడంపైనా దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. క్రమం తప్పకుండా దంతాలను శుభ్ర పరచుకోవడం, చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడు కోవడం ద్వారా శరీర సమతుల్యత మెరుగుపడి చ ర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుందని చెప్పారు. ఆయుర్వేద వనమూలికలు కలిగిన డాబర్ రెడ్ టూత్ పేస్ట్ వాడడం వల్ల దంత సంరక్షణ మెరుగు పడుతుందని శాస్త్రీయ ఆధారాల్లో తేలిందని తెలి పారు.

## ఇండ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు తావు ఉండదు

- డబుల్ బెడ్ రూముల నిమిత్తం 8333 దరఖాస్తులు.
- 1001 డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి.
- ప్రస్తుతం 581ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు సిద్ధం.
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.




**తాండూరు జూన్ 6(జనంసాక్షి)** డబల్ బెడ్ రూమ్‌ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో తాండూరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వెంకటాచారి, తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాథోడ్ దశరథ సింగ్, మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపు పై కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ తాండూర్ నియోజక వర్గంలో డబుల్ బెడ్ రూముల నిమిత్తం 8333 దరఖాస్తులు వచ్చాయని ,1001 డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు ప్రస్తుతం 581 ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల కేటాయింపులు ఎలాంటి అవకతవకలు తావు ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లు అయితే మాత్రమే ఇండ్ల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హత లేకుండా ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిసిన పక్షంలో ఫిర్యాదులను స్వీకరించి మరో దఫా విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

## అనుమతి లేని అనాథ శరణాలయాలపై కఠిన చర్యలు

- బాలల న్యాయ చట్టం ప్రకారం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేసిన మహిళా, శిశు సంక్షేమ శాఖ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5 (జనంసాక్షి):** బాలలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రతి అనాథ శరణాలయం, స్వచ్ఛంద సంస్థ తప్పనిసరిగా మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి నమోదు ధ్రువీకరణ పత్రం పొందాలని జిల్లా సంక్షేమ అధికారి శారద స్పష్టం చేశారు. బాలల న్యాయ చట్టం--2015 ప్రకారం అనుమతి లేకుండా అనాథ శరణాలయాలు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం, 0 నుంచి 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రతి సంస్థ తప్పనిసరిగా మహిళా, శిశు సంక్షేమ శాఖ వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. నమోదు ధ్రువీకరణ పత్రం లేకుండా అనాథ శరణాలయాలు లేదా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించడం బాలల న్యాయ చట్టం--2015 ప్రకారం నేరమని తెలిపారు. చట్టంలోని సెక్షన్--42 ప్రకారం అనుమతి లేకుండా బాలలకు ఆశ్రయం కల్పిస్తున్న సంస్థల నిర్వాహకులకు ఒక సంవత్సరం వరకు జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఇప్పటి వరకు నమోదు చేసుకోని సంస్థలు వెంటనే మహిళా, శిశు సంక్షేమ శాఖను సంప్రదించి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది సంయుక్తంగా జిల్లాలోని నమోదిత అనాథ శరణాలయాలు, స్వచ్ఛంద సంస్థలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అనాథ శరణాలయాలను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బాలల భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, బాలలకు ఆశ్రయం కల్పించే ప్రతి సంస్థ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంపై మరిన్ని వివరాల కోసం బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ లేదా జిల్లా బాలల సంరక్షణ అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 82478 14647, 85200 43943.

## ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

**యాచారం ,జూన్ 6 (జనం సాక్షి ):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యావ్యవస్థలో నాణ్యత, పారదర్శకతను పెంచడానికి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడులలోనే చదివించాలనే డిమాండ్ ప్రజల నుండి బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వం నుండి జీతాలు, సౌకర్యాలు పొందుతున్న వారే ప్రభుత్వ విద్యాసంస్థలను నమ్మకపోతే సామాన్య ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుందని ప్రజా సంఘాలు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినప్పుడే అక్కడ పర్యవేక్షణా లోపం తొలిగి, మౌలిక వసతులు వేగంగా మెరుగుపడతాయని వారు అభిప్రాయపడుతున్నారు. పేద, ధనిక బేధం లేకుండా అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందాలన్నా, ప్రభుత్వం కేటాయించే కోట్లాది రూపాయల నిధులు సద్వినియోగం కావాలన్నా ఈ విధానం అత్యంత అవసరమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. గతంలో అలహాబాద్ హైకోర్టు కూడా ప్రభుత్వ జీతాలు తీసుకునే వారు తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపాలని ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా తగిన నిబంధనలు లేదా జీవోను తీసుకురావాలని ప్రజలు మరియు విద్యా వికాస వేదిక ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## వనమహోత్సవంలో రైతులంతా భాగస్వాములు కావాలి

- యాచారం ఎంపీడీఓ రాధ రాణి
- తోటలు పెంచే రైతులకు రెండేళ్ల పాటు ఉచిత ఉపాధి హామీ మెయింటెనెన్స్
- ఇంటింటికీ 6 పండ్ల మొక్కల పంపిణీ




**యాచారంజూన్ 06,(జనం సాక్షి ), :** ప్రజా పాలన – పల్లె ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామం లో గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా యాచారం ఎంపీడీవో రాజారాణి హాజరయ్యారు గ్రామసభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి, అందుబాటులో ఉన్న మొక్కల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వనమహోత్సవం కార్యక్రమానికి సంబంధించిన మండల ప్రణాళికను గ్రామసభలో వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తమ పొలం గట్ల చుట్టూ విధిగా మొక్కలు నాటుకోవాలని మరియు హార్టికల్చర్ (ఉద్యానవన) తోటలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు తమ పొలాలలో మొక్కలు నాటుకుని, తోటలు పెంచుకుంటే వారికి ఉపాధి హామీ పథకం తరపున రెండు సంవత్సరాల పాటు ఉచితంగా నిర్వహణ ఖర్చులు (మెయింటెనెన్స్) కూడా అందుతాయని స్పష్టం చేశారు. రైతులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనితో పాటు, పల్లె ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీలోని ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, మరియు రోడ్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని విధిగా చేపట్టనున్నట్లు తెలిపారు. పచ్చదనాన్ని ప్రతి ఇంటికీ చేరవేసేందుకు గాను, ఇంటింటికీ ఆరు పళ్ల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఆ మొక్కలను నాటి, క్షేమంగా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఇంటి సభ్యులపై ఉందని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టే ఈ బృహత్తర కార్యక్రమంలో యాచారం మండల పరిధిలోని ప్రతి రైతు మరియు గ్రామస్తులు భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జూన్ 16, 17 తేదీలలో రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలను జయప్రదం చెయ్యండి

### ఆలేటి ఎల్లయ్య, పోటెపాకు రామస్వామి



**హయత్ నగర్, జూన్ 6 (జనం సాక్షి )** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు జూన్ 16, 17 తేదీలలో జరిగే సమావేశాలను జయప్రదం చేయాలని, ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సాగర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో పార్టీ సభ్యులతో కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు పోటెపాకు రామస్వామి లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జూన్ 16, 17 తేదీ లలో యువ కార్యకర్తల సమావేశం కొత్తపేట లోని బాబు జగ్జీవన్ రావు హాల్లో జరుగుతుందని, 16 న జరిగే సమావేశానికి యువతి యువకులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని అన్నారు. ఆ ప్రజాస్వామిక పద్ధతులలో రాజకీయాలు చేస్తున్న బిజెపి మతాల మధ్య చిచ్చు రాజేస్తుంది, కులాల మధ్య తగాదాలు, రేపుతున్నదీ, తన రాజకీయ లబ్ధి కోసం అల్లర్లు సృష్టిస్తుంది, ఇది ధర్మం కాదు భారతదేశపు ప్రజాస్వామిక రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేసి మన దేశంలో మతం పేరుతో ఒక నిరంకుశ పాలన ముందుకు తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు పన్నులు 33 శాతం నుండి 25 శాతానికి తగ్గించింది. ఏ దేశంలోనూ ఇంత తక్కువ పన్నులు లేవు, ఈ విధానం కార్పొరేట్లకు స్వర్గం సామాన్యులకు నరకంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమంది శతకోటేశ్వర్లకు పన్ను రాయితీ రూపంలో 55 లక్షల కోట్లు ముట్ట చెప్పిందని, సెస్, జిఎస్టి ల పేరుతో డీజిల్, గ్యాస్, పెట్రోల్ వంటి నిత్యవసర ధరలపై అధికత బారాలు మోపుతుంది. ఇలా కార్పొరేటర్లే ప్రయోజనాల కోసం దేశానికి వెన్నెముక అయినా రైతంగానే బలి అని ఆవేదన వ్యక్తం చేశారు. బగ్న మైన యువత స్వప్నాలు దిగజారుతున్నాయని, నిరుద్యోగం సంక్షోభం తీవ్ర స్థాయికి చేరిందని, భారతదేశాన్ని పుల్లగొడుతున్న బడా వ్యాపారులు, ఆదాని, అంబానీతో మోడీ బంధం బలపడగా వేతనాల కుదింపుతో కార్మిక వర్గం ఆధునిక బానిసత్వంలో కూరుకుపోయిందని అన్నారు. రాబోయే రోజు లలో నిరుద్యోగం కోసం, ఫీజుల నియంత్రణ చట్టం కోసం, విద్య, వైద్యం ప్రభుత్వం నియంత్రణలో ఉండాలని, యువత ముందు అంచులు ముందు వరుసలో ఉండి ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడం కోసం యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి భూమిపూజ



**ఉప్పల్ జూన్ 06 ( జనం సాక్షి ):** ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన మరియు వేగవంతమైన పౌర సేవలను అందించాలనే లక్ష్యంతో నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు అన్ని సేవలను ఒకే చోట సులభంగా అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన మున్సిపల్ భవనం ఆధునిక సౌకర్యాలతో నిర్మించబడనుండగా, ప్రజలకు అవసరమైన పౌర సేవలు మరింత సమర్థవంతంగా అందే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భవనంలో విశాలమైన కార్యాలయాలు, ప్రజల కోసం ప్రత్యేక సేవా కేంద్రాలు, సమావేశ మందిరాలు, డిజిటల్ సేవల కోసం ఆధునిక సదుపాయాలు, వృద్ధులు మరియు దివ్యాంగులకు అనుకూలమైన ప్రాప్యతా సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ భవనం నిర్మాణంతో మున్సిపల్ పరిపాలన మరింత వేగవంతం కానుండటంతో పాటు ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలు, పన్నులు, అనుమతులు మరియు ఇతర సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గనుంది. ఒకే చోట అన్ని సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా కావడంతో పాటు ప్రజలకు మెరుగైన అనుభవం లభించనుంది. పట్టణాభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నూతన మున్సిపల్ భవనం నిర్మాణం ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం ఒక భవన నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజలకు మెరుగైన పాలనను అందించే దిశగా ఒక కీలక అడుగుగా నిలవనుంది. స్థానిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడుతున్న ఈ భవనం, ప్రజా సేవల అందజేతలో కొత్త ప్రమాణాలను నెలకొల్పనుంది. ప్రజల అవసరాలు, ఆశయాలను కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ భూమిపూజ మరో నిదర్శనంగా నిలిచింది.

# రక్తదానం జీవన వరం- కార్మిక సంక్షేమం సమాజానికి బలం:ఈటల రాజేందర్



**ఘట్కేసర్, జూన్ 06 ( జనం సాక్షి )** మన రక్తం ఒకరి జీవితాన్ని కాపాడుతుంది.మన సేవ ఒక కార్మికుడి భవిష్యత్తును మార్చుతుంది. సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయం ఆర్భాటాలకు దూరంగా... సమాజ సేవకు అంకితమైన కార్యక్రమాలు ఈ రోజు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ శ్రీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలలు తన స్వగృహం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విచ్చేసి, వారి చేతుల మీదుగా వేలాది మంది కార్మికులకు లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, “రక్తదానం అనేది మహాదానం. మనం ఇచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడగలదు. సమాజంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అండగా నిలవాలి. జన్మదినాలు, శుభకార్యాలు వంటి సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం” అని అన్నారు. అలాగే కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడుతూ, “దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పది. వారి కష్టంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. లేబర్ కార్డులు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు, విద్యా మరియు వైద్య ప్రయోజనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి అర్హత కలిగిన కార్మికుడు లేబర్ కార్డు పొందాలని, వారి హక్కులను కాపాడేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని” పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ ఏనుగు సుదర్శన్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ గారు,మాజీ అధ్యక్షులు కామారెడ్డి ఇంచార్జ్ పట్లోళ్ల విక్రమ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిలు అమర మోహన్ రెడ్డి,గోనె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గొంగల్లా బాలేష్ , డివిజన్ అధ్యక్షులు,వివిధ మోర్చా అధ్యక్షులు, పతాధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర మరియుజిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పీఎస్ కాలనీలో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రామంతాపూర్, జూన్ 6 ( జనం సాక్షి ) :** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పీఎస్ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు కాలనీవాసులతో కలిసి కాలనీలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర అంశాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని, మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే కాలనీలోని అంతర్గత రహదారుల పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రోడ్ల అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాలనీలోని పార్కును పరిశీలించిన ఆయన, పిల్లలు, యువత మరియు వృద్ధులకు ఉపయోగపడే విధంగా ఆధునిక సౌకర్యాలతో పార్కును అభివృద్ధి చేయాలని తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కాలనీలో కీలక కూడళ్లు, ప్రధాన వీధులు మరియు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా వీధి దీపాల కోసం అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై కూడా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వెలుతురు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పీఎస్ కాలనీలో గుర్తించిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించి, కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారిని కలిసిన ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి ముష్యం శ్రీనివాస్



**ఉప్పల్, జూన్ 6 (జనం సాక్షి):** పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల సమన్వయం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగం తీసుకురావాలనే లక్ష్యంతో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమితులైన ముష్యం శ్రీనివాస్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ముష్యం శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, డివిజన్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యకర్తలతో సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందన తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, డివిజన్ పరిధిలోని ప్రతి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ముష్యం శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై పార్టీ నాయకత్వం ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు.ఉప్పల్ డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం, ప్రజలతో మమేకమవడం మరియు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ముష్యం శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఆయన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# వీరన్నపేట్ ,పెద్ద ఎల్కిచర్ల గ్రామాలకు పూర్వ ప్రాథమిక విద్య పాఠశాలమంజూరు



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** జిల్లేడు చౌదరిగూడ మండలంలో రెండు పూర్వ ప్రాథమిక విద్య పాఠశాలలు మంజూరు కాబడినవి. వీరన్నపేట్, పెద్ద ఎల్కిచర్ల గ్రామాలకు పూర్వ ప్రాథమిక విద్య పాఠశాల మంజూరు చేయబడినయి ఇందులో విధులు నిర్వహించేందుకు మహిళా ఇన్స్ట్రక్టర్లు ,ఆయా కొరకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు.ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి వయోపరిమితి 18 నుంచి 44 సం.మధ్యలో ఉండిఉండాలి. అర్హులైనవారు ఈనెల 10 నా సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత మండల విద్యాఅధికారి ఎంఈఓకు దరఖాస్తు ధ్రువపత్రాలు అందించాలని పేర్కొన్నారు.ఈ ఎంపికలు జూన్ 11నా త్రిమెన్ కమిటీ ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈఓ.లఆధ్వర్యంలో జరుగునని పేర్కొన్నారు.

## యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం ఎంతో ఆనందదాయకం

## పోచబోయిన సురేష్ యాదవ్



**హయత్ నగర్ జూన్ 6 (జనం సాక్షి)** మాన్సూరాబాద్ డివిజన్ పరిధి లోని పెద్ద చెరువులో వాలీబాల్ ఆడుతున్న యువ క్రీడాకారులను మాన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా సురేష్ యాదవ్ యువ క్రీడాకారులతో కలిసి కొంత సమయం గడిపి, వారి ఆటతీరు, ప్రతిభను అభినందించారు. యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టు భావన వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దేవనూర్‌లో గ్రామసభ వర్షాకాల ప్రణాళిక, ‘రక్షణ నేత్రం’ పోస్టర్ల విడుదల

- వర్షాకాల కార్యాచరణకు ప్రణాళిక.
- రక్షణ నేత్రం’ పోస్టర్ల ఆవిష్కరణ.
- మురుగు కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులపై దృష్టి.




**తాండూరు జూన్ 6(జనంసాక్షి)** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా యాలాల మండలం దేవనూర్ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ప్రత్యేక అధికారిగా ఎమ్మార్వో గాయత్రి హాజరయ్యారు.రాబోయే వర్షాకాలంలో తలెత్తే సమస్యలపై పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్థులతో చర్చించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా మురుగు కాలువల పూడికతీత, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, మొక్కల పెంపకం వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం తప్పనిసరి అని ఎమ్మార్వో గాయత్రి సూచించారు.అదే కార్యక్రమంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ నేత్రం పోస్టర్లను ఎస్ఐ విఠల్ రెడ్డి విడుదల చేశారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత మరింత బలోపేతం అవుతుందని ఆయన వివరించారు. మహిళా రక్షణ, మాదక ద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు, ఉప సర్పంచ్ బోడ్కా మాధవి మల్లేశం, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద

## ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- అనుభవం ఉన్న నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్
- మోమిన్ పేట మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్



**మోమిన్ పేట జూన్ 06 ( జనం సాక్షి)** వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు మంత్రి పదవిలో చోటు కల్పించాలని మోమిన్ పెట్ మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ, గడ్డం ప్రసాద్ కుమార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మంత్రి పదవిలో కొనసాగిన నాయకుడని కొనియాడారు. రాబోయే మంత్రివర్గ విస్తరణలో గడ్డం ప్రసాద్ కుమార్ కు మంత్రి పదవిలో చోటు కల్పించాలని తెలిపారు. గడ్డం ప్రసాద్ కుమార్ సీనియర్ నాయకుడని, ఆయనకు సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానం పై ఉందని అన్నారు. గడ్డం ప్రసాద్ కుమార్ కు మంత్రి పదవి రావాలనే కోరిక వికారాబాద్ నియోజకవర్గ నాయకులకు ఉందని అన్నారు. ప్రసాద్ కుమార్ కు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే వికారాబాద్ నియోజకవర్గంతో పాటు, వికారాబాద్ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆలయ వార్షికోత్సవంలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు



**తాండూరు జూన్ 6(జనంసాక్షి)** బషీరాబాద్ మండలం మార్పల్లి గ్రామంలోని బుగ్గ రామేశ్వరలింగం చెన్నకేశవ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది మనోహర్ రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా మనోహర్ రావు స్వగ్రామం మార్పల్లి కావడం విశేషం. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణ ముదిరాజ్, బంటారం భద్రేశ్వర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు, బీజేపీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, 33వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బందారు శ్రీకాంత్ తో పాటు గ్రామ సర్పంచ్, పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 10న కలెక్టరేట్ ముట్టడి



**కాప్రా, జూన్ 6 (జనం సాక్షి ):** దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెరుగుదలను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో గోడపత్రికను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా వియస్ బోస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతోందని,మరోవైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు . సాధారణ కుటుంబం నెలవారీ ఖర్చులు భరించలేని స్థితికి చేరుకుందన్నారు. బియ్యం, పప్పులు, కూరగాయలు, వంటనూనె, గ్యాస్ సిలిండర్, పాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో “అచ్చే దిన్” వస్తాయని చెప్పిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇవేనా మంచి రోజులు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గడం లేదన్నారు గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్య ప్రజలకు అందని స్థాయికి ఎందుకు చేరాయని , రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే, వినియోగదారులకు మాత్రం అధిక ధరలు ఎందుకు? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ధరలను కూడా నియంత్రించలేకపోవడం ఎందుకు,కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు ప్రజలకు ఉపశమనం కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నాయని వారు ప్రశ్నించారు. విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక సేవలు సామాన్యులకు భారంగా మారడానికి బాధ్యత ఎవరిది? ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఐ స్పష్టం చేస్తోందన్నారు . ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నా పాలకులు ప్రచార ఆర్భాటాలు, కార్పొరేట్ అనుకూల విధానాలతో కాలక్షేపం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లిశంకర్ జీ. దామోదర్ రెడ్డి,డీజీ. సాయిలు గౌడ్, ఎస్. శంకర్ రావు, కల్లూరు ధర్మేంద్ర, కె. స్వామి, రచ్చ కిషన్, సత్య ప్రసాద్, యాదయ్య, నిమ్మల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యాలు కల్పించాలి
- రైతులు, హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం డిమాండ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 6 (జనంసాక్షి):** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, హమాలీ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేసి ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని సీపీఎం కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కీసర రైతు వేదిక పరిధిలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతులు మరియు హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులతో సమావేశమై ధాన్యం కొనుగోలు పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్ర అధికారి నరహరి మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే రైతులకు 40 వేల గోనె సంచులు పంపిణీ చేసినట్లు, వాటిలో 25 వేల సంచులు మాత్రమే కేంద్రానికి తిరిగి వచ్చాయని, మిగిలిన సంచులు రైతుల వద్ద ఉన్నాయని చెప్పారు. కొన్ని చోట్ల మిల్లర్ల ఆలస్యం కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం బంగారు నర్సింగరావు మాట్లాడుతూ ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు వాతావరణం అనుకూలించి దిగుబడులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. అయితే పెరిగిన దిగుబడులకు అనుగుణంగా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు, గోనె సంచుల కొరత కారణంగా ధాన్యం సకాలంలో తూకం వేయడం జరగడం లేదని, కొందరు రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చి 15 నుంచి 20 రోజుల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. హమాలీ కార్మికులు మండుతున్న ఎండల్లో తీవ్ర కష్టాలు పడుతూ పనిచేస్తున్నప్పటికీ వారికి ఎలాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అందడం లేదన్నారు. హమాలీలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసి ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యాన్ని పూర్తిగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నప్పటికీ, మిల్లర్లు తాలు పేరుతో అధిక మొత్తంలో కోతలు విధించడం రైతులకు నష్టదాయకంగా మారిందన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, హమాలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మొయినాబాద్ సీఐ మల్లికార్జున్‌రెడ్డి మోత్కుపల్లిలో సీసీ కెమెరాలు, నేరాలపై అవగాహన



**మొయినాబాద్. జనం సాక్షి జూన్.06** సీసీ కెమెరాలు నేరాలు, ఘోరాలను చితిరకరించి మూడవ కన్నుగా నిలుస్తాయని మొయినాబాద్ సీఐమల్లికార్జున్రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామాన్ని సీఐ మల్లికార్జున్రెడ్డి, ఎస్సై నయీముద్దీన్తో కలిసి పర్యటించి సీసీ కెమెరాలను పరిశీ లించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు, ఘోరాలను వెంటనే పరిష్కరించేందుకు వీలు ఉంటుందన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వారు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫోన్లలో ఓటీపీలు వచ్చినప్పుడు వాటి నెంబర్లు చెప్పమని అడిగితే ఎవరికి చెప్పవద్దు అని సూచించారు. దాని వల్ల నష్టపోయేది మీరే అని తెలిపారు. ఓటీపీ చెప్పడం వల్ల మీ ఫోన్ డాటా మొత్తం వారి చేతులోకి వెళ్తుందని ఇలా సైబర్ నేరగాళ్లు ఎంతో మంది తయారు అవుతున్నారని సూచించారు. ఉమ్మడి రాష్ట్రం ఆంధ్ర, తెలంగాణలో అప్పట్లో కొంత మంది ఉన్నప్పటికి ప్రస్తుతం వేలల్లో సైబర్ కేటుగాళ్లు పుట్టుకొస్తున్నారన్నారు. వారి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని మనం సేఫ్ గా ఉన్నప్పుడే కాపాడుకుంటామని అన్నారు. రాను రాను టెక్నాలజీ పెరుగుతున్న దృశ్యా ప్రతి ఒక్కరు ఫోన్లు వాడుతున్నారని వాటి వల్ల కొన్ని మంచి జరగవచ్చు, చెడు జరగవచ్చునన్నారు. మోసాలకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో ఉన్న ఫామ్ హౌస్లు అధిక సంఖ్యలో వెలుస్తున్నాయని, పుట్టగొడుగులా పుడుతున్నాయని ఇందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫామ్ హౌస్లకు ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసిన ఫామ్ హౌస్ల యజమానుల పోన్ నెంబర్లు, ఆధార్ కార్డులు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఫామ్ హౌస్లను ఎవరికి లీజ్కు ఇచ్చిన వెంటనే గ్రామ పంచాయతీలో తెలిపే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఫామ్ హౌస్లో ఎప్పుడు ఏమి జరిగిన వెంటనే సైబర్ క్రైమ్ 1930 నెంబర్కు పోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణరాములు, ఉపసర్పంచ్ సుబ్బారావు, వార్డు సభ్యులు ఎర్రోళ్ల విఠల్, ఎర్రోళ్ల కాంతరాజు, దుర్గపల్లి విజయవాణి, లక్ష్మి, లలిత, ఇందిరమ్మ, వ్యవసాయ అధికారి అనురాధా, పంచాయతీ కార్యదర్శి, నాయకులు మోత్కుపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలి:మల్లికంటి వీరన్న



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** కుమ్మర్ల కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్లు నిధులు కెటాయించాలనే న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 7న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించ తలపెట్టిన ‘కుమ్మర్ల నిరసన దీక్ష’ను విజయవంతం చేయాలనీ అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికంటి వీరన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. మానవ నాగరికతకు కుమ్మరి తొలిమెట్టు-కుండ ఆయువు పట్టు అని చెప్పుకోవడానికి గొప్పగా ఉన్నప్పటికీ తెలంగాణలోని కుమ్మర్ల సామాజిక స్థితిగతులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకుల నిర్లక్ష్యం వలన కుమ్మర్లు నేటికి విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 12 ఏళు గడుస్తున్నా ప్రభుత్వాల నుంచి కుమ్మర్లకు ఆశించిన సహకారం అందలేదన్నారు. ప్రభుత్వాలు మరిచిపోయిన కుమ్మర్ల సంక్షేమాన్ని గుర్తు చేసేందుకే ఈ దీక్ష చేపట్టినట్లు స్పష్టం చేశారు. కావునా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కుమ్మర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలనీ వీరన్న కోరారు.

# విద్యాసంస్థల భాగస్వామ్యాల సంయుక్త పరిశోధనలు ఎంతో దోహదపడుతాయి



**నిజాంపేట్ జూన్ 6( జనం సాక్షి)** ఇండో--జపాన్ విద్యాసంస్థల పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి బీవీఆర్ఐటీ హైదరాబాద్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలను శనివారం హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వ ప్రతినిధి బృందం సందర్శించారు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ( ఎస్ వి ఈ ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బీవీఆర్ఐటీ హైదరాబాద్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ( బివిఆర్ఐటిహెచ్)లోని విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ (వీజేఓసి) జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వానికి చెందిన అడ్వాన్స్ ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ ప్రతినిధి బృందంలో ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునెషి హిరోయోషి, అదే విభాగానికి చెందిన కోగా యుయా, లోకల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్ సూపర్వైజర్ హరాజోనో యోషిహిరో టోయి మరియు పాల్గొన్నారు. సందర్శన సందర్భంగా, విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ ద్వారా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చేపడుతున్న ఇండో--జపాన్ విద్యా, పరిశోధన, సాంస్కృతిక పారిశ్రామిక సహకార కార్యక్రమాల పై ప్రతినిధి బృందానికి సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా జపనీస్ భాషా శిక్షణ, విద్యార్థులు అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు, జపాన్‌లో ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్య అవకాశాలు, సంయుక్త పరిశోధన కార్యక్రమాలు, అలాగే జపాన్ విశ్వవిద్యాలయాలు , సంస్థలతో ఉన్న భాగస్వామ్యాల కు సంబంధించి వివరించారు. ప్రతినిధి బృందం కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులతో సమావేశమై, భారతదేశం, జపాన్ మధ్య విద్యా, సాంస్కృతిక మరియు సాంకేతిక సంబంధాలను బలోపేతం చేయడంలో సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కల్పిస్తూ గ్లోబల్ నైపుణ్యాలను పెంపొందించడంలో బీవీఆర్ఐటీ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఫునెషి హిరోయోషి, జపనీస్ భాషను నేర్చుకోవడంలో విద్యార్థులు చూపుతున్న ఆసక్తి, క్రమశిక్షణ , చురుకుదనాన్ని అభినందించారు. జపాన్‌లో నైపుణ్యం కలిగిన భారతీయ యువతకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను ప్రస్తావిస్తూ, జపాన్‌లో ఉన్నత విద్య, ఇంటర్న్‌షిప్‌లు , ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థులు భాషా నైపుణ్యాలతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే హిరోషిమా ప్రిఫెక్చర్ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య భవిష్యత్తులో విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యాలు, సంయుక్త పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉద్యోగ అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత , ప్రిన్సిపాల్ -- బీవీఆర్ఐటీ హైదరాబాద్; డాక్టర్ సంజయ్ దుబే , ప్రిన్సిపాల్ -- బీవీఆర్ఐటీ నర్సాపూర్; డాక్టర్ రామ భద్ర , జపాన్ హబ్; డాక్టర్ రాజు ఏడ్ల, డీన్ -- పరిశోధన అభివృద్ధి; డాక్టర్ సునీల్ , వైస్ ప్రిన్సిపాల్; టగూచి , జపనీస్ భాషా ఉపాధ్యాయులు; అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు.. హిరోషిమా ప్రిఫెక్చర్ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అభివృద్ధి చెందుతున్న సహకార సంబంధాల్లో ఈ సందర్శన మరో కీలక మైలురాయిగా నిలిచిందని ఇరువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధకులకు ప్రపంచ స్థాయి అవకాశాలను సృష్టించడమే కాకుండా, భారతదేశం జపాన్ ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి సంకల్పాన్ని ఈ సందర్శన పునరుద్ఘాటించిందని. ఇరు సంస్థల భాగస్వామ్యాలు అభిప్రాయం తెలియజేశారు.

# బూర్జుగడ్డ తండాలో కోడిపందాలపై పోలీసుల దాడి - 8 మంది అరెస్ట్





**శంషాబాద్,జూన్6(జనంసాక్షి)** శంషాబాద్ మండలంలోని బూర్జుగడ్డ తండా గ్రామ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై శంషాబాద్ పోలీసులు శుక్రవారం మెరుపు దాడి నిర్వహించి 8 మందిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 6న ఉదయం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బూర్జుగడ్డ తండా శివారులోని ఓ మామిడి తోటలో కొందరు వ్యక్తులు బెట్టింగ్‌లతో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.9,900 నగదు, 11 కోళ్లు, 8 సెల్‌ఫోన్లు, ఒక కారు, మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కట్టా దుర్గాప్రసాద్ అలియాస్ శివ, బందారు హరికృష్ణ, కొక్కిర్లపాటి వర్మ, గొట్టుముక్కల మానస ఫణి వంశీ కృష్ణంరాజు, పాలగాని రాంబాబు, సయ్యపురాజు సోమరాజు, సయ్యపురాజు భరత్ శివరామరాజు, దేవులపల్లి సంజయ్ రెడ్డి ఉన్నారు. ఈ ఘటనపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు.

# కోహెడ రైతు మహోత్సవానికి తరలి వెళ్లిన ఫరూక్‌నగర్ మండల రైతులు



జనంసాక్షి ఫరూఖ్ నగర్ **రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో శనివారం నిర్వహించనున్న చారిత్రాత్మక రైతు మహోత్సవానికి ఘన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఫరూక్‌నగర్ మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుమారు 239 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,300 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సమీకృత పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల రవాణా సౌకర్యం కోసం ఫరూక్‌నగర్ మండలం నుంచి 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది -- అన్నదాతల అభ్యున్నతే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత" అనే సందేశంతో రైతు మహోత్సవం నిర్వహించబడుతోంది.**

# నేడు జరగాల్సిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎల శిక్షణ కార్యక్రమంలో స్వల్ప మార్పు

- **ఈ నెల 9న వినాయక ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం.**
- **సార్ కన్వీనర్ కరణము పురుషోత్తం రావు.**



**తాండూరు జూన్ 6(జనంసాక్షి )**కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సార్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధ్యక్షతన నేడు ఆదివారం పట్టణంలో ని తులసీ గార్డెన్స్‌లో నిర్వహించాల్సిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎ ల శిక్షణ కార్యక్రమం అనివార్య కారణాల దృష్ట్యా స్వల్ప మార్పు జరిగిందని సార్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుండి వినాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ స్వల్ప మార్పును పార్టీ నాయకులు, బిఎల్ ఎలు గమనించి సహకరించి, పాల్గొని శిక్షణ కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మీరు ఎక్కడ ఉద్యోగం చేసిన మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలి

**చిన్న చిల్కమర్రి సర్పంచ్ గడ్డం యాదగిరి**



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** మీరు ఎక్కడ ఉద్యోగం చేసిన మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని,చిన్న చిల్కమర్రి గ్రామభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని చిన్న చిల్కమర్రి సర్పంచ్ గడ్డం యాదగిరి అన్నారు.గ్రామ పరిపాలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా చిన్న చిల్కమర్రి గ్రామ కార్యదర్శి జగదీశ్ ను మరో ప్రాంతానికి బదిలీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడ్డం యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో గ్రామ కార్యదర్శి విశేష కృషి చేశారని వివరించారు.కొత్తగా విధులు నిర్వహించే ప్రాంతంలో కూడా సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరిగా జరుగుతుందని వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ నన్ను గ్రామస్తులు ఎంతగానో ఆదరించారని, నేను ఎక్కడికి వెళ్లినా ఈ గ్రామాన్ని మర్చిపోలేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వలిగి కృష్ణ, ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు కావాలి సత్యమ్మ, మంగమ్మ, మల్లేష్,సాయినాథ్ గౌడ్, లావణ్య,వాణి శ్రీ,పల్లె నర్సింహ రెడ్డి,గ్రామస్తులు కొత్త శేఖర్, తెలుగు యాదయ్య,అంగన్వాడీ టీచర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# వీరన్న గుట్టలో గోడకూలి రేకుల ఇల్లు ధ్వంసం



**హయత్ నగర్, జూన్ 6 (జనం సాక్షి)** మన కాలనీ శిరిడి సాయి నగర్ వీరన్న గుట్టలో శనివారం సాయంత్రం గాలి దుమారానికి లింగయ్య ఇంటిపై నుండి బైకాని శేఖర్ రేకుల ఇంటి పైన గోడ కూలి రేకుల మీద పడి ఇంట్లో ఉన్న సామాన్లు ధ్వంసం అయినాయి. అదృష్టవశాత్తు పిల్లలకు, ఫ్యామిలీకి ఏం కాలేదు, కాలనీ అధ్యక్షులు కే నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోటయ్య, వైస్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్, వైస్ ప్రెసిడెంట్ దేవరాయ సర్వేశ్ లు వారిని పరామర్శించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, వారికి ఏదైనా సాయం చేయడానికి నేను కృషి చేస్తాను అని నరసింహ యాదవ్ తెలిపారు.

## అంగన్‌వాడీల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోండి

**ఎంఈఓ మల్లయ్య**



**మొయినాబాద్ : జనం సాక్షి జూన్ 06** అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ మల్లయ్య తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 8 వరకు అవకాశం కలదు అని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు ప్రాథమిక శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయోపరిమితి సడలింపు వర్తిస్తుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎంఈఓ, తహసీల్దార్ (ఎంఆర్వో), ఎంపీడీఓ సభ్యులుగా ఉన్న ముగ్గురు సభ్యుల కమిటీ ఆమోదం తప్పనిసరిగా ఉంటుందని వివరించారు.

## కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు దేవనూర్ కాంగ్రెస్ యువనాయకులు



**తాండూరు జూన్ 6(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శనివారం కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువనేతలు మాట్లాడుతూ గత పదేళ్ల పాలనకు భిన్నంగా ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేస్తూ, ప్రజలే అంతిమ నిర్ణేతలని విశ్వసిస్తూ, ప్రజాభిప్రాయాన్నే తన అభిప్రాయంగా స్వీకరించి పాలన సాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో రేవంతన్న అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే రేవంతన్న అనే స్థాయిలో ప్రజాదరణ పొందిన ఆయన, గడీల పాలనకు స్వస్తి పలికిన నాయకుడిగా పేరొందారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి దేవనూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మించనున్న ఈ సమీకృత పండ్ల మార్కెట్ వల్ల రైతులకు, వ్యాపారులకు మెరుగైన సదుపాయాలు అందుతాయని తెలిపారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల్లో చురుగ్గా మాజీ కార్పొరేటర్ శాంతి



**అల్వాల్, జూన్ 6 (జనంసాక్షి):** అల్వాల్ డివిజన్ పరిధిలో శనివారం మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. టెంపుల్ అల్వాల్ ధోబీఘాట్ వద్ద రజకులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు ఆమె నూతన బోర్వెల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బట్టలు ఉతుకుకోవడానికి నీటి వసతి కల్పిస్తున్నందుకు రజక సంఘం నాయకులు ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, వెంకటేష్, లక్ష్మణ్, రాము, వర్తిక, విజయ, స్థానిక నాయకులు అరుణ్, యాదగిరి గౌడ్, సాజిద్, మహేష్ పాల్గొన్నారు. రూ. 8 లక్షలతో సివరేజ్ పనులు: అనంతరం ఎంఈఎస్ కాలనీలో రూ. 8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (సివరేజ్) నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మధుకర్, మణి, కొండల్ రెడ్డి, సుఖదేవ్ గుప్తా, మోహన్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి

- హైడ్రా అధికారులతో కలిసి వాటర్ లాగింగ్ పాయింట్స్ పరిశీలించిన బొంతు శ్రీదేవి యాదవ్



**కాప్రా, జూన్6 ( జనం సాక్షి ) :** కుషాయిగూడ డివిజన్‌లో రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనే బొంతు శ్రీదేవి యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం హైడ్రా అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీ మోహన్ రావు తో కలిసి సాయి నగర్ కాలనీ, టాటా మోటార్స్ మెయిన్ రోడ్, డీ మార్ట్ వద్ద ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను అధికారులకు మాజీ కార్పొరేటర్ శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షానికి నీరు నిలిచే ఈ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, డ్రైనేజీలను క్లియర్ చేయాలని హైడ్రా అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని కోరారు. వర్షాకాలం ముందే అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సిబ్బంది స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌లో మెరిసిన గిరిజన విద్యార్థి

- ఆల్ ఇండియా 8వ ర్యాంకు సాధించిన కేతావత్ చరణ్ నాయక్
- అభినందించిన మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,సర్పంచ్ కొర్ర శిరీష కృష్ణ నాయక్.



**తలకొండపల్లి జూన్ 06(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని హర్యానాయక్ తాండ గ్రామపంచాయతీ నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన విద్యార్థి కేతావత్ చరన్ నాయక్ ఇటీవల ప్రకటించిన జేఈఈ (ఐఐటి) అడ్వాన్స్ లో ఆల్ ఇండియా 8వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,హర్య నాయక్ తండ సర్పంచ్ కొర్ర శిరీష కృష్ణ నాయక్,జేఈఈ లో 8వ ర్యాంకు సాధించిన కేతావత్ చరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఒక నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి కష్టాలను ఎదుర్కొంటూ..ఎన్ని అడ్డంకులు వచ్చినా చదువును ఆపకుండా జేఈఈ అడ్వాన్స్ లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం గొప్ప విషయం అన్నారు. భవిష్యత్తు కాలంలో గొప్ప చదువులు చదివి,పుట్టిన ఊరుకు,కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోచారం రాజిరెడ్డి,దేవా నాయక్,గణేష్,శేఖర్,తదితరులు ఉన్నారు.

## భారతీయ కిసాన్ యూనియన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఉప్పరి ప్రసాద్ నియామకం



**వికారాబాద్ జూన్ 06 ( జనం సాక్షి)** భారతీయ కిసాన్ యూనియన్ న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్నది భారతదేశం వ్యాప్తంగా కిసాన్ రైతుల సమస్యలను చౌదరి పాల్ అంబావత్ నాయకత్వంలో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో కిసాన్ యూనియన్ విస్తరణలో భాగంగా రైతు కార్మిక యూనియన్ నాయకులు ఉప్పరి ప్రసాద్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగిందని జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఎం ముస్తాక్ వాజిద్ అలీ పర్యవేక్షణలో మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డీకే చంద్రశేఖర్ చేతుల మీదుగా ఉప్పరి ప్రసాద్‌కు అందజేశారు వికారాబాద్ జిల్లా కిసాన్ యూనియన్ అధ్యక్షులుగా నన్ను నియమించినందుకు జాతి అధ్యక్షులకు రాష్ట్ర అధ్యక్షులకు ఎంతో కృతజ్ఞుడైయున్నాను అంతేకాకుండా వారు నాపై పెట్టిన నమ్మకాన్ని రైతులకు కలిగిన ప్రతి సమస్యపై పోరాడుతూ పెద్దల సమక్షానికి అధికారుల సమక్షంలోనికి తీసుకెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని ఉప్పరి ప్రసాద్ రైతు కిసాన్ సంఘ అధ్యక్షులు తెలపడం జరిగింది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతి సమస్యను స్వయంగా పర్యవేక్షించి పరిష్కరిస్తాం.
- 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణా రెడ్డి.



**తాండూరు జూన్ 6 (జనంసాక్షి)** ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో కౌన్సిలర్ పి. బాలకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డులోని వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించి, ప్రజల నుండి నేరుగా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ, వార్డులో ఉన్న ప్రతి సమస్యను స్వయంగా పర్యవేక్షించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ వార్డు సభలో వార్డు ఆఫీసర్ జి. స్నేహలత, స్పెషల్ ఆఫీసర్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆర్‌పి శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ భాగ్యమ్మ, ఆశా వర్కర్ మల్లీశ్వరి, జవాన్ బాలు తదితరులతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సభకు స్థానికుల నుండి మంచి స్పందన లభించింది.

## వీధి ఆహార వ్యాపారులు ఆహార భద్రత ప్రమాణాల అమలే ప్రజారోగ్యానికి రక్షణ

### మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి



**చేవెళ్ల, జూన్ 6 (జనంసాక్షి)** వీధి ఆహార వ్యాపారులు ఆహార భద్రత ప్రమాణాల అమలే ప్రజారోగ్యానికి రక్షణ అని, వీధి ఆహార వ్యాపారులు ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అరుణ గార్డెన్ లో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) దక్షిణ ప్రాంత కార్యాలయం చెన్నై ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు పరిశుభ్రత, ఆహార భద్రతపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించి వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి ఆహార వ్యాపారులు ఆహార భద్రత ప్రమాణాల అమలే ప్రజారోగ్యానికి రక్షణ అని అన్నారు. వీధి ఆహార వ్యాపారులు ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆహార నిల్వ విధానాలు, వినియోగదారులు ఆరోగ్య పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, శుభ్రమైన నీటి వినియోగం, సురక్షిత ముడిపదార్థాల వినియోగంపై ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అవగాహన కార్యక్రమాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన ఆహార పద్ధతులు పాటించి వినియోగదారుల విశ్వాసాన్ని పొందడమే కాకుండా వ్యాపారాభివృద్ధిని కూడా సాధించాలన్నారు. ఆహార భద్రతకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు వ్యాపార నిర్వహణలో అనుసరించాలన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ ఆర్థిక అవగాహన అంశాలను తెలుసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహార సేవల ద్వారా సమాజానికి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులు, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్ళపల్లి నర్సింహులు, నర్సింలు, చేవెళ్ల మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని వీధి వ్యాపారులు, మహిళలు తదితరులు ఉన్నారు.

# యాంటీ డ్రగ్స్‌పై విస్తృత అవగాహన

- కొందుర్గ్ మండలం తంగెళ్లపల్లి గ్రామంలో గ్రామసభ
- ఓటరు జాబితా సవరణ,భూధార్ కార్డ్
- కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ లక్ష్మీ నారాయణ



**కొందుర్గు (జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం తంగెళ్లపల్లి గ్రామంలో శనివారం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ఏసీపీ (ూజ్రూ), రూరల్ సీఐ (జ×), కొందుర్గు మండల తహశీల్దార్, స్థానిక ఎస్సై (ా×) లతో పాటు గ్రామ సర్పంచ్ చందన గోవర్ధన్ గౌడ్ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి శాంతిభద్రతలు రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఈ సభలో పలు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితా ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్) ప్రక్రియపై తహశీల్దార్ గ్రామస్తులకు వివరించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. భవిష్యత్తు ఎన్నికల్లో పారదర్శకత కోసం ఈ మ్యాపింగ్ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. రైతుల భూములకు డిజిటల్ రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విశిష్ట భూధార్ గుర్తింపు కార్డులపై ఈ సభలో ప్రత్యేక చర్చ జరిగింది. భూముల యాజమాన్య హక్కులలో అక్రమాలకు తావులేకుండా, ప్రతి సర్వే నంబర్‌కు ఒక ప్రత్యేక ఐడీ కేటాయించే విధానాన్ని తహశీల్దార్ రైతులకు వివరించారు. దీనివల్ల భూ తగాదాలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

### యాంటీ డ్రగ్స్ అవగాహన

యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల (ఐతీబస్త్రం) మహమ్మారిపై షాద్‌నగర్ ఏసీపీ, రూరల్ సీఐ, స్థానిక ఎస్సైలు కలిసి గ్రామస్తులకు, ముఖ్యంగా యువతకు విస్తృత అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, వాటి రవాణా లేదా విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తంగెళ్లపల్లి గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా మార్చడానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపుగ్రామ సర్పంచ్ చందన గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శాంతిభద్రతల కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తంగెళ్లపల్లి గ్రామం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు స్వయంగా విచ్చేసి ప్రజల్లో చైతన్యం నింపడం అభినందనీయమని కొనియాడారు.

# నార్సింగ్ డీసీ లక్ష్మారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

### విద్యుత్, రోడ్లు, ట్రాఫిక్ సమస్యలపై వినతి



**రాజేంద్రనగర్,జూన్6(జనంసాక్షి)** నార్సింగ్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డిని గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు సంధ్యా రాము, జల్లి సాయిరాం, మాజీ వార్డు సభ్యురాలు సునీత ప్రభు, లలు ప్రసాద్ యాదవ్ తదితరులు డీసీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం నార్సింగ్ గ్రామ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న వాహన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో పలు ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్ల మరమ్మతులు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నాయకులు కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. వినతులను సానుకూలంగా స్వీకరించిన డీసీ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సవాల్

- కొడంగల్ లో రాజీనామా చేసి నాపై గెలిచి చూపించు
- నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**బొంరాస్ పేట, జూన్ 6 (జనం సాక్షి):** మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభ కార్యక్రమంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గా శనివారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచే ప్రసక్తి లేదని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ వేసి ముందు కొడంగల్ నియోజకవర్గంలో రాజీనామా చేసి తనపై గెలవాలని సవాల్ విసిరారు.నేను ఓడిపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు.పాలమూరు, కొడంగల్ రైతులపై ప్రేమ ఉంటే శ్రీశైలం బ్యాక్ వాటర్ దగ్గర గతంలో సీఎంగా ఉన్నప్పుడు కెసిఆర్ ఎక్కడైతే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారో అక్కడ రూ.5,000 కోట్లు పెట్టి మోటార్లను రన్నింగ్ చేసి ఎత్తిపోతల ప్రారంభించాలన్నారు.కమిషన్ల కోసమే నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకం అని ఎద్దేవా చేశారు.పోలీసులు, ఇతర శాఖల అధికారులపై మా ప్రభుత్వం వచ్చాక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కేసులు బనాయించడం తగదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, చాంద్ పాషా,ఉప్పరి మహేష్, శ్రావణ్ గౌడ్, సలాం, మడిగే శ్రీనివాస్, లగచర్ల సురేష్, సర్పంచులు బాలు నాయక్,హీరు నాయక్,జలీల్, తదితరులు పాల్గొన్నారు.

# భేదాభిప్రాయాలు వీడి ముందుకు సాగాలి

### తోట లక్ష్మీకాంత్ రెడ్డి పిలుపు



**అల్వాల్, జూన్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మల్కాజ్‌గిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 194 డివిజన్ భూదేవి నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలంతా భేదాభిప్రాయాలు పక్కనబెట్టి ఏకతాటిపై ముందుకు సాగాలన్నారు. ప్రతి కాలనీలోని ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, మంద బాలకృష్ణారెడ్డి, కృష్ణ గౌడ్, వెంకట్రావు, భాస్కర్, లక్ష్మణ్ రావు, సాయికుమార్, శివశంకర్, సంజీవ్ గౌడ్, రాజేందర్, లక్ష్మి, జ్యోతి, భబిత తదితరులు పాల్గొన్నారు.

## షామీర్‌పేట్ మండలంలో నూతన ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో

# ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం



**శామీర్ పేట్, జూన్ 6(జనం సాక్షి )** షామీర్‌పేట్ మండల పరిధిలో నూతనంగా మంజూరైన ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి స్థానిక మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధి కారి కమలాకర్ తెలిపారు.మండలంలోని పాఠ శాలల్లో ప్రీ–ప్రైమరీ విభాగాలు మంజూరయిన తూముకుంట, పోతాయిపల్లి, దేవరయంజాల్, మందాయపల్లి,ఉప్పరపల్లి, సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగిన స్థానిక మహిళలు 2026 జూన్ 8వ తేదీ లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.ఆయా 7వ తరగతి ఉత్తీర్ణత, ఇన్‌స్ట్రక్టర్ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత విద్యా అర్హతలు ఉండి వయోపరిమితి: 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు.ఆయాకు నెలకు 6,000, ఇన్‌స్ట్రక్టర్ నెలకు 8,000 రూపాయల గౌరవ వేతనం ఇస్తుందన్నారు.సంబంధిత అర్హతలు, ఎంపిక విధానం మరియు ఇతర వివరాల కోసం మండల విద్యా కార్యాలయం లేదా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. ప్రీ–ప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు నాణ్యమైన ప్రారంభ విద్య అందించడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని మండల విద్యాధికారి కమలాకర్ పేర్కొన్నారు.

# భర్తతో గొడవపడి ఇంట్లో నుండి వెళ్లిన భార్య



**మల్కాజిగిరి జూన్ 6 (జనం సాక్షి)** భర్తతో గొడవపడి భార్య ఇంట్లో నుండి వెళ్లిపోయిన సంఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. వెస్ట్ గోదావరి కి చెందిన శ్రీ లక్ష్మీ(59) మోహన్ రావు భార్య భర్తలు, మే 30న ఇద్దరూ కలిసి సఫిల్ గూడా లో నివాసముంటున్న తన కూతురు ప్రత్యూష ఇంటికి వచ్చారు. శనివారం ఉదయం భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడడంతో మనస్థాపం చెందిన శ్రీలక్ష్మి ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లిపోయింది. బంధువులు స్నేహితుల దగ్గర వెతికిన ప్రయోజనం లేకపోవడంతో భర్త మోహన్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- సైబరాబాద్ సిపి డా. ఎం. రమేష్
- స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలు
- సీసీటీవీ, జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి
- రియల్ టైమ్ అప్లికేషన్, కమాండ్ సెంటర్ ఏర్పాటు
- ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం



**శేరిలింగంపల్లి, జూన్ 06 (జనంసాక్షి):** విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ శనివారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు, విద్యా సంస్థల రవాణా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన సిపి, ప్రతి స్కూల్ బస్సు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్, సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్ టైమ్ లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థ, అత్యవసర నిష్క్రమణ తలుపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. సమావేశంలో స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌పై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థుల రవాణాలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, నిబంధనల అమలు, భద్రత అందుబాటు ధరల్లో రవాణా సేవలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని సిపి తెలిపారు.ల ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహన సమాచారాన్ని నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ఎడిసిపి హనుమంతరావు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ శీతల్ సోహన్, మేడ్చల్ డీటీఓ శ్రీనివాస్, ఆర్టీసీ మియాపూర్ డీఎం ప్రశాంత్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.




# బాలల భద్రత కోసం 'సురక్ష మిత్ర'

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 6 (జనంసాక్షి):** బాలల భద్రత కోసం వినూత్నంగా 'సురక్ష మిత్ర' సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. శనివారం పరిగి పోలీస్ స్టేషన్‌లో లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామ సభల కార్యక్రమంలో భాగంగా, ప్రజల రక్షణ కోసం సమాజ భాగస్వామ్యంతో పనిచేయాలనే లక్ష్యంతో ఈ వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

పరిగి శాసనసభ్యులు రామ్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో 'సురక్ష మిత్ర' లోగోను ఆవిష్కరించారు. మహిళలు, బాలల భద్రతను పటిష్టం చేయడానికి పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేవలం పోలీసుల నిఘా మాత్రమే కాకుండా ప్రజల సహకారం ఉంటే నేరాల నియంత్రణలో విశేష ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, మహిళలు, బాలల భద్రతను పటిష్టం చేయడంలో 'సురక్ష మిత్ర' కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో సురక్ష మిత్రలను ఏర్పాటు చేసి ప్రజా భాగస్వామ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉత్తములను అవార్డులతో సత్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, డీపీఓ జయసుధ, పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ కమల్ నాయక్, ఏఎంసీ చైర్మన్ పరశు రామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. మల్లేష్, ఎస్‌డీపీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ హరిప్రియ రెడ్డి, ఎమ్మార్వో వెంకటేశ్వరి, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఖాన్ హోటల్ స్లాబ్ కూలి నలుగురికి గాయాలు

మర్పల్లి జూన్ 6 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని విషాదకర సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ దుకాణాల సముదాయంలో ఖాన్ హోటల్ పై కప్పు స్లాబ్ కూలి నలుగురికి గాయాలయ్యాయి. ఈ వార్త విన్న మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల్లో నిర్వహిస్తున్న ఖాన్ హోటల్ రోజు మాదిరిగానే హోటల్ ను తెరిచాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో భవనం స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు వ్యాపారులు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకొని మోమిన్ పేట సిఐ వెంకట్, మర్పల్లి ఎస్సై రవూఫ్, గ్రామ సర్పంచ్ రామేశ్వర్ స్థానికులతో కలిసి స్థితులాల కింద చిక్కుకున్న నలుగురిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన నలుగురిని బయటకు తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారికి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారు నాజర్ (19), రమేష్ (35), శివకుమార్ (23), చందన (12) ఉన్నారు వీరులో ఇద్దరు తీవ్ర గాయాలు కాగా మరికొందరు కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి విచారణ జరిపి బాధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.




బాధితులను పరామర్శించిన స్పీకర్ ప్రసాద్ కుమార్.

స్లాబ్ కూలిన ప్రమాదాన్ని తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెంటనే స్పందించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యం గురించి వారికి అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణం అధికారులపై మండిపడుతున్న మండల ప్రజలు. స్లాబ్ కూలి నలుగురికి గాయాలైన సంఘటనకు ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్షణమే ఈ ఘటనకు కారణమని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రత్యేక గ్రామ సభల్లో ప్రజాపాలనా-ప్రగతి అంశాలపై చర్చ



**శంషాబాద్, జూన్6(జనంసాక్షి) :** శంషాబాద్ మండలంలోని కవ్వగూడ, పెద్దతుప్ర తండా, పెద్దషాపూర్, అలికోల్ తండా గ్రామ పంచాయితీలలో శనివారం ప్రజాపాలనా–ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. పెద్దతుప్ర తండా గ్రామ సభకు జిల్లా పంచాయితీ అధికారి హాజరై గ్రామంలోని నర్సరీ, వైకుంతధామం, డంపింగ్ యార్డును సందర్శించి పలు సూచనలు చేశారు.ఈ గ్రామ సభల్లో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, వనమహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , వరద నిర్వహణ, భద్రత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి ఎ.రమేష్, ఎంపీడీవో జి.మున్ని, సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో

# ఫీజు రాయితీ అమలు చేయాలి

### టిడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అంబాల విష్ణు



**కిసర సర్కిల్ జవహర్ నగర్, జూన్ 6 (జనంసాక్షి):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్‌గా అంబాల విష్ణు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీలను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు రాజ్యాంగ వ్యవస్థలో నాలుగో స్థంభంగా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, నేడు వారి ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది జర్నలిస్టులు తక్కువ ఆదాయంతో కుటుంబాలను పోషించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లల విద్యా ఖర్చులు భరించడం భారంగా మారిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం గతంలో ప్రకటించిన హామీలు, సంక్షేమ పథకాలు మరియు ఇతర సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, గృహ వసతి, బీమా, పెన్షన్ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టిడబ్ల్యూజెఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అంబాల విష్ణు తెలిపారు.

# కుటుంబ బంధాల పరిరక్షణకు కౌన్సెలింగ్ కీలకం

**సికింద్రాబాద్, జూన్ 6 (జనంసాక్షి):** కుటుంబ బంధాల పరిరక్షణకు కౌన్సెలింగ్ కీలకమని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతల్లో ఒకటని డీజీపీ పేర్కొన్నారు. మహిళల భద్రత, కుటుంబ సామరస్యం, దాంపత్య బంధాల బలోపేతం లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో "మీ సురక్ష – కలసి ఉంటే కలదు సుఖం" ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళల అభివృద్ధి, సాధికారత కేంద్రం (సీడీఈడబ్ల్యూ) కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా పునరేకీకృత దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, షీ–టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ షటిల్స్, సీడీఈడబ్ల్యూ కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు మహిళల భద్రత, పునరావాసం, న్యాయ సహాయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

"మీ సురక్ష – కలసి ఉంటే కలదు సుఖం" కార్యక్రమాన్ని ప్రశంసించిన ఆయన, కౌన్సెలింగ్, మధ్యవర్తిత్వం ద్వారా కుటుంబాలను తిరిగి కలపడంలో మల్కాజిగిరి మహిళా భద్రత విభాగం చేసిన కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా భద్రతా కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు సుమారు 6,700 దంపతులను తిరిగి కలిపినట్లు వెల్లడించారు. తెలంగాణ మహిళా భద్రత విభాగం డీజీపీ



చారుసిన్హా మాట్లాడుతూ, పరస్పర గౌరవం, నమ్మకం, అవగాహన ఆరోగ్యకరమైన కుటుంబ బంధాలకు పునాదులని చెప్పారు. భరోసా కేంద్రాలు, కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు కుటుంబ వివాదాల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల విద్య, ఉద్యోగాలు, వ్యక్తిగత లక్ష్యాలకు కుటుంబ సభ్యులు సహకరించాలని సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు 9,700కు పైగా కేసులు పరిష్కరించగా, 32 వేలకు పైగా కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పునరేకీకృత దంపతులకు ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు ఉత్తమ సేవలు అందించిన సీడీఈడబ్ల్యూ కేంద్రాలు, కౌన్సెలర్లు, సిబ్బందిని సత్కరించారు. కుటుంబ సామరస్యం, మహిళల భద్రత, పరస్పర గౌరవం, శాంతియుత వివాద పరిష్కారానికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

### టీజీ20 టోర్నమెంట్‌కు వ్యతిరేకంగా

# ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద టీసీఏ భారీ ధర్నా

- హాజరు కానున్న బండారు దత్తాత్రేయ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న టీజీ20 టోర్నమెంట్‌ను తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఖండించి ది. టోర్నమెంట్‌కు వ్యతిరేకంగా నేడు హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పోలీసుల అనుమతి లభించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ధర్నాకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు పలువురు ప్రస్తుత, మాజీ క్రికెటర్లు, క్రికెట్ నిర్వాహకులు, టీసీఏ నాయకులు హాజరై సంఘీభావం ప్రకటించను న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ... టీజీ20 టోర్నమెంట్‌కు సంబంధించి టీసీఏ లేవనెత్తిన ప్రశ్నలకు హెచ్‌సీఏ ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేదా బీసీసీఐ అనుమతులు బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఎనిమిది ఫ్రాంచైజీలకు ఆటగాళ్ల వేలం నిర్వహిస్తూ ముందుకు సాగడం అనేక అనుమానాలను కలిగిస్తోందన్నారు. అన్ని అనుమతులు ఉంటే వాటిని ప్రజల ముందుం చడంలో హెచ్‌సీఏకి భయం ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. సభ్య క్లబ్‌లు, క్రికెటర్లు, వాటాదారులకు పారదర్శకంగా సమాచారం ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం లేదా జింఖానా మైదానంలో బహిరంగంగా నిర్వహించకుండా ప్రైవేట్ వేదికల్లో కార్యక్రమా లు జరపడం మరింత అనుమానాలను పెంచుతోందన్నారు. 2018లో బీసీసీఐ జారీ చేసిన సంబంధిత లేఖతో సహా తమ వద్ద ఉన్న పలు ఆధారాలను ఇప్పటికే ప్రజల ముందుంచామని, తెలంగాణ క్రికెట్ భవిష్యత్తు, పారదర్శకత, జవాబుదారీతనం మరియు నిబంధనల అమలుపై చర్చించేందుకు ఈ ధర్నా వేదిక కానుందని గురువారెడ్డి తెలిపారు. క్రికెటర్లు, క్లబ్ ప్రతినిధులు, క్రీడాభిమానులు, ప్రజలు పాల్గొని తెలంగాణ క్రికెట్ హక్కుల పరిరక్షణకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చి భారీ దోపిడీ

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** వృద్ధ దంపతులను లక్ష్యంగా చేసుకుని ఇంట్లో పనిమనిషిగా చేరి, మత్తుమందు ఇచ్చి చేతులు, కాళ్లు కట్టేసి భారీ దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర నేపాలీ ముఠాను మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు కొవ్వకుల మహేష్ (25 ఏళ్లు, తండ్రి: కె. రాజలింగం, వృత్తి: పాత సామాన్ల వ్యాపారం – ఉండవల్లి గ్రామం, నివాసం: గాంధీ విగ్రహం దగ్గర, చంపాపేట్)ను 'అలికేఫ్' (ఆస్ట్రేలియా) వద్ద అదుపులోకి తీసుకుని 12 గ్రాముల బరువున్న బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలు: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్‌లోని మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసించే అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీ మోహన్ సర్వీపురం (68) దంపతులు ఇంట్లో ఒంటరిగా ఉంటున్న విషయాన్ని గమనించిన మీనా, రాజేష్ అనే నేపాలీ కార్మికులు దోపిడీకి పథకం రచించారు. మరో ఏడుగురు సహచరులతో కలిసి ముఠాగా ఏర్పడి, ఏప్రిల్ 25న సబీనా అనే మహిళను పనిమనిషిగా ఇంట్లో చేర్పించారు. మే 11న మీనా పుట్టినరోజు వేడుకల పేరిట సర్వెంట్ క్వార్టర్స్‌లో సమావేశమై, రాత్రి ఐదుగురు నిందితులు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధ దంపతులను బంధించి మత్తు పదార్థం ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసి, ప్లాస్టిక్ టేపులు, బట్టలతో కట్టేసి బెదిరించారు. ఇంట్లోని అల్మారాలు పగులగొట్టి 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కిలోల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, 3,000 అమెరికన్ డాలర్ల నగదును దోచుకెళ్లారు.



పోలీసు చర్యలు: బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్అండ్‌వో, ఎస్‌వోటీ, సీసీఎస్ విభాగాల సహకారంతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 255 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు, వేలిముద్రలు, శాస్త్రీయ ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ద్వారా దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నించగా, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, లక్నో, పూణే, నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు చేపట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మీనా, రాజేష్‌లపై గతంలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు. ఈ అరెస్ట్ ప్రక్రియ హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షితా మూర్తి శ్రీ, అదనపు డిప్యూటీ కమిషనర్ జె. నరసయ్య పర్యవేక్షణలో జరిగింది.

### సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న

# వసతులను ఉపయోగించుకోవాలి

**ప్రీ ప్రైమరీ టీచర్ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి**

**ఏర్పుమళ్ళ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి**




**బొంరాస్ పేట, జూన్ 6 (జనం సాక్షి):** సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ఉపయోగించు కోవాలని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామ సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ తిరుపతయ్యతో కలిసి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను పంపకుండా ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయాలని తల్లిదండ్రు లను కోరారు. ఇప్పటికే పాఠశాలకు ప్రభుత్వము అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ రావడం జరిగిందన్నారు. వీటిని పాఠశాల పున: ప్రారంభమైన వెంటనే అందజేయడం జరుగుతుంద న్నారు. ఈ సంవత్సరం నుండి ప్రీ ప్రైమరీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రీ ప్రైమరీ టీచర్ ,ఆయా పోస్టుకు ఈనెల 9 వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఉద్యోగాల నోటిఫికేషన్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ తిరుపతయ్యతో కలిసి ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్,ఎస్ఎం సి మాజీ చైర్మన్ అనంతయ్య పాల్గొన్నారు.

## ఇన్ స్ట్రక్టర్,ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**మండల విద్యాధికారి చాంప్లా నాయక్**



**తలకొండపల్లి జూన్06(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం కానున్న ప్రీ–ప్రైమరీ తరగతుల కోసం ఇన్ స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చాంప్లా నాయక్ తెలిపారు. తలకొండ పల్లి మండల కేంద్రంతోపాటు గట్టు ఇప్పలపల్లి, వెల్జాల్, పడకల్ గ్రామాల స్థానికులు ఈనెల 10వ తేదీ వరకు అర్హత గల అభ్యర్థు లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆయా పోస్టుకు 10వ తరగతి అర్హత,ఇన్ స్ట్రక్టర్ పోస్ట్ కు ఇంటర్మీడియట్ అర్హతగా పేర్కొన్నారు.ఆయాకు నెలకు రూ,6 వేలు,ఇన్ స్ట్రక్టర్ కు గౌరవ వేతనం రూ,8 వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందని ఎంఈఓ తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నేతలు



**రాజేంద్రనగర్,జూన్6(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షు డు దుద్దు ఆకాష్, టీపీసీసీ అధ్యక్షుడి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంతో పాటు బూత్ స్థాయి కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్, ఎన్ఎస్యూఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు దుద్దు ప్రణయ్ పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలపై పోరాటం చేస్తాను

**ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు అంగోత్ కృష్ణ నాయక్**

మహేశ్వరం,జూన్ 6(జనం సాక్షి):గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తానని మహేశ్వరం మండలం బీజేపీ పార్టీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు అంగోత్ కృష్ణ నాయక్ అన్నారు. శనివారం మహేశ్వరం మండల ఎస్టీ మోర్చా మండల కమిటీని ప్రకటించారు. గిరిజన మోర్చా ఉపాధ్యక్షులుగా భాస్కర్,టిల్లు,భాస్కర్ ,శంకర్,ప్రధాన కార్యదర్శులుగా రామావత్ హరిలాల్, రెడ్యా,కార్యదర్శులుగా సాయందర్ రాథోడ్,రమేష్,దాస్రు, వెంకటేష్, కోశాధికారిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా తావుర్య, అఖిల్, సురేష్, శ్రీను ,రవి, ప్రదీప్, మీడియా కన్వీనర్ గా నాగేష్,మీడియా కో కన్వీనర్ కుమార్, ఐటీ కన్వీనర్ గా గోపాల్ , ఐటి కో కన్వీనర్ గా జైహింద్ ను ప్రకటించారు.

## కోట్ పల్లి మండల కేంద్రంలో త్రాగునీటి కష్టాలు

**కోట్ పల్లి జూన్ 05 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండల కేంద్రంలో త్రాగునీటి కష్టాలు తప్పడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. 20 రోజుల నుండి కోట్ పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో పాడైపోయిన బోర్ ను రిపేర్ చేయించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు మాత్రం తీరడం లేదని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మంచి నీటి సమస్యను వెంటనే తీర్చాలని, పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మర్పల్లి ఘటనలో గాయపడ్డ వారికి 10 లక్షలఎక్స్గ్రేషియా ప్రకటించాలి

**- డాక్టర్ మెతుకు ఆనంద్**



**మర్పల్లి జూన్ 06 (జనంసాక్షి) :** మర్పల్లి మండల కేంద్రంలో స్లాబ్ కూలి గాయాల పాలైన ఘటన దురదృష్టకర మని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని ఖాన్ హోటల్ పైకప్పు స్లాబ్ కూలి నలుగురికి గాయాలైన వై స్పందించిన ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి. ఈ బాధ్యత స్పీకర్ తీసుకోవాలి. కొంతమందికి కాళ్లు, చేతులు విరిగినట్లు మా దృష్టికి వచ్చింది. అందరూ బాధితులకు మెరుగైన చికిత్స ప్రభుత్వం అందజేయాలి.స్లాబులు ఆ విధంగా ఉంటే పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు ?అధికారులను ప్రశ్నించాల్సిన స్పీకర్ ఏం చేస్తున్నారు ?పేద ప్రజల ప్రాణాలకు విలువ లేదా ?ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఈ విధంగా ప్రమాదకరంగా ఉన్నటువంటి భవనాలన్నిటిని సరి చేయాలి.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా ఇలాంటి భవనాలన్నింటినీ సరి చేశామని,మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి వాటి మీద దృష్టి పెట్టకుండా, భూముల (రియల్ ఎస్టేట్) పై మాత్రమే దృష్టి పెట్టడం ఏంటి అని అన్నారు.